Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.05.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




(వివరాలు 10వ పేజీలో)

## • నెల్లూరులో...

# ఫ్యాన్ 10/10

• పదిసీట్లు వైసిపి ఖాతాలోకే
• రెండు లోక్‌సభ స్థానాలలోనూ జయభేరి






## విద్యుత్ సేవలను...

# ఎప్పటికప్పుడు విస్తరిస్తున్నాం

**- ఎస్ఇ కె. విజయకుమార్‌రెడ్డి**

జిల్లాలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వినియోగదారులకు సేవలను విస్తరిస్తున్నామని ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్.ఇ కె. విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులోని విద్యుత్‌శాఖ డివిజినల్ కార్యాలయంలో ఈనెల 18న ఆయన అధికారులతో సమావేశమై విద్యుత్‌సేవలను సమీక్షించారు. అనంతరం విలేకరులుతో మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణానికి 220 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో రెండు 130 కేవి సబ్‌స్టేషన్లు కూడా ఏర్పాటుచేసేందుకు తగు పరిశీలనలు చేస్తున్నామన్నారు. కోటీ 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఆత్మకూరు డివిజన్ సొంత కార్యాలయం భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఈ నిర్మాణం పూర్తయితే డివిజన్, సబ్‌డివిజన్‌లకు పరిపాలనపరంగా మరింత వెసులుబాటు కలుగుతుందన్నారు. జిల్లాలో సముద్రతీర ప్రాంతంలో ఎంతోకాలం నాటి విద్యుత్‌స్తంభాలను, లైన్లను అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ఆధునీకరించి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూస్తున్నామన్నారు. ఏ సమస్యలున్నా అప్పటికప్పుడు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపిఎస్‌పి డిఎసిఎల్ ఎస్ఏఓ ఎం.సత్యనారాయణ, ఆత్మకూరు డిఇఇ కె.రాఘవేంద్ర రావు, ఉదయగిరి ఏడిఇ డివి కృష్ణారెడ్డి, ఏఏఓ పి.వి కృష్ణారావు పాల్గొన్నారు.

## పురాతన వస్తువులు...


# పూర్వీకుల జీవన ప్రతీకలు

**- గొట్టిప్రోలులో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో వక్తలు**



మాట్లాడుతున్న పురావస్తుశాఖ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి

మన పూర్వీకుల కాలం నాటి జీవన విధానాలు తెలిపేవే పురాతన వస్తువులని, ఇవెంతో చరిత్రాత్మకమైనవని, మన పురాతన వైభవాలు, చరిత్రాత్మక కట్టడాలు వగైరాలన్నీ ఎంతో స్ఫూర్తిదాయకమైనవని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా బెంగుళూరులోని భారతీయ పురాతత్వ సర్వేక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో ఈ నెల 18న నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొని పురాతన వస్తువుల ప్రాధాన్యతను వివరించారు. భారతీయ పురావస్తుశాఖ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు గ్రామ శివారు ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాల్లో ప్రాచీనకాలం నాటి పలు పురాతన వస్తువులు బయల్పడ్డాయని చెప్పారు. గొట్టిప్రోలు కోటదిబ్బలో గత 3నెలలుగా పురావస్తుశాఖ జరుపుతున్న తవ్వకాల్లో ప్రాచీనకాలం నాటి శిలాశాసనాలు, రోమన్ కాలం నాటి వస్తువులు బయల్పడ్డాయన్నారు. దీంతో గొట్టిప్రోలు ఒక చరిత్రాత్మక ప్రాంతంగా గుర్తింపులోకి వచ్చిందన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ పురావస్తు ప్రొఫెసర్ వి.శకుంతల మాట్లాడుతూ గొట్టిప్రోలులో సుమారు 2500 సంవత్సరాల నాటి పురాతన కట్టడాలు ఉన్నాయని పురావస్తుశాఖ సర్వేలో పేర్కొన్నారని, ఆ మేరకు బెంగుళూరు పురావస్తు అధికారులు ఇక్కడ తవ్వకాలు చేపట్టారని తెలిపారు. ఈ తవ్వకాల్లో పురాతన కట్టడాలు, శ్రీమహావిష్ణు రాతి ప్రతిమ, పురాతన పనిముట్లు, కుండ పెంకులు, మట్టిబొమ్మలు, రంగు రాళ్ళు వగైరాలు బయల్పడ్డాయన్నారు. పురాతన వస్తువులు వెలికితీసి భద్రపరిచేందుకు భారతీయ పురాతత్వ సర్వేక్షణ ఉత్ఖనన శాఖ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్‌లలో తవ్వకాలు చేపట్టాయని వివరించారు. ఈ సందర్భంగా తవ్వకాల్లో బయల్పడిన పురాతన వస్తువుల ఫోటోలను ప్రదర్శించారు. ఈ సదస్సులో ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ పి.భాస్కర్‌రెడ్డి, మద్రాసు యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి.తిరుమూర్తిలతో పాటు పలుప్రాంతాల నుంచి పరిశోధకులు, ప్రొఫెసర్లు, గొట్టిప్రోలు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## కార్మిక సమస్యల

# సాధన కోసమే సమ్మె నోటీసు



ఆర్టీసి డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయు నాయకులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఎన్ఎంయు నాయకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసి డిపో ఎదుట ఈ నెల 20న ఆ సంఘం నాయకులు ధర్నాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు రీజనల్ కార్యదర్శి లుక్సన్ మాట్లాడుతూ ఆర్టీసి యాజమాన్యం ఎంతోకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. కార్మికసంఘాలు తలపెట్టిన సమ్మెకు సమాయత్తం చేయడానికి అన్ని డిపోల్లో ధర్నాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విజేతలు

# వీళ్లే...!

నెల్లూరు పార్లమెంట్
**ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 1,24,680
(23వ తేదీ రా॥ 12గం.ల వరకు)



తిరుపతి పార్లమెంట్
**బల్లి దుర్గాప్రసాద్, వైకాపా**
మెజార్టీ: 2,26,061

## సెంటిమెంట్ 'హీరో'



ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఏ పార్టీలో వుంటే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ మరోసారి ఋజువైంది. ఈ ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన తిరుగులేని మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆదాల వైసిపిలో చేరినప్పుడే... ఆయన విజయంతో పాటు పార్టీ గెలుపు కూడా డిక్లేర్ అయినట్లయ్యింది. 1999లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆదాల ఆ ఎన్నికల్లో అల్లూరు నుండి ఎమ్మెల్యేగా గొలుపొందాడు. 2004లో కాంగ్రెస్‌లో చేరి సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. 2009లోనూ సర్వేపల్లి నుండి రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించాడు. 2014లో టిడిపిలో చేరి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయాడు. ఈ కాలమంతా కూడా ఆయన అధికార పార్టీలలోనే వున్నాడు. ఇప్పుడు వైసిపిలో చేరడం ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన సెంటిమెంట్ అలానే నిలిచింది.

## అదృష్ట 'బల్లి'



2019 ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి తొలి అదృష్టవంతుడు ఎవరన్నా ఉన్నారంటే... అతను బల్లి దుర్గాప్రసాదరావే! చంద్రబాబు దగ్గర అసెంబ్లీ సీట్‌కే సీన్ లేకుంటే... వైసిపిలో చేరి, పక్కరోజే తిరుపతి ఎంపి అభ్యర్థి అయ్యాడు. జగన్ ప్రభంజనంలో అత్యంత సులువుగా ఎంపి అయ్యాడు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన బల్లి దుర్గాప్రసాద్‌రావు దాదాపు 2లక్షల మెజార్టీతో విజయం సాధించడం జరిగింది. 1985 నుండి కూడా తెలుగుదేశం పార్టీలో వుంటూ నాలుగు సార్లు గూడూరు నుండి తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన బల్లి దుర్గాప్రసాద్‌రావుకు గత ఎన్నికల్లో చంద్రబాబు సీటు ఇవ్వలేదు. ఇప్పుడు ఎన్నికల్లో కూడా తనకు సీటు లేదని తెలిసిపోవడంతో ఆయన వైసిపిలో చేరాడు. చేరిన పక్కరోజే తిరుపతి ఎంపి అభ్యర్థిగా ఆయన్ను అనౌన్స్ చేసినప్పుడే ఆయన లక్కీ అని తెలిసిపోయింది.




---

నెల్లూరు నగరం
**పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైకాపా**
మెజార్టీ: 1,988



### సెన్సేషన్ విక్టరీ

రాష్ట్రంలో వైసిపి 150 స్థానాలు గెలవడం ఒక ఎత్తైతే... అందులో నెల్లూరు సిటీ నుండి అనిల్ గెలవడం ఒక ఎత్తు. ఏ నియోజకవర్గంలో లేని పోటాపోటీ ఎలక్షన్ ఇక్కడే జరిగింది. చివరి వరకు ఉత్కంఠతగా కౌంటింగ్ సాగింది. చివరకు స్వల్ప మెజార్టీతో అనిల్‌ని విజయం వరించింది.

నెల్లూరు గ్రామీణం
**కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 20,167



### రూరల్ రూలర్

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరోసారి తన సత్తా చాటాడు. నిత్యం ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యేగా పేరు గడించిన శ్రీధర్‌రెడ్డి అదే ప్రజాదరణతో వరుసగా రెండోసారి నెల్లూరురూరల్ నియోజకవర్గం నుండి ఘనవిజయం సాధించాడు.

కోవూరు
**నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 39,737



### కోవూరు హీరో

కోవూరు నియోజకవర్గం నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంచి మెజార్టీతో విజయం సాధించాడు. అన్ని రౌండ్లలోనూ ఆయన ఆధిపత్యం చూపించాడు. కోవూరు నుండి గతంలో 5సార్లు విజయం సాధించిన ఆయన ఇప్పుడు ఆరో విజయాన్ని నమోదు చేశాడు.

సూళ్ళూరుపేట
**కిలివేటి సంజీవయ్య, వైకాపా**
మెజార్టీ: 61,147



### కంచుకోట సూళ్లూరుపేట

ఎన్నికల రోజునే వైసిపి విజయం ఖాయమైపోయిన నియోజకవర్గం సూళ్లూరుపేట. తెదేపా నాయకులు ఎన్నికల రోజునే ఈ సీటుపై ఆశలు వదులుకున్నారు. వైసిపి అభ్యర్థి సంజీవయ్య వ్యక్తిత్వం, మంచితనం, వైసిపి పట్ల ప్రజాదరణ వెరసి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో ఆయనను గెలిపించేందుకు కారణమయ్యాయి.

---

ఉదయగిరి
**మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 36,081



### నమ్మకమే గెలిపించింది

ఉదయగిరి నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మకంగా కనిపెట్టుకుని ఉన్నందుకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తగిన బహుమతి పొందాడు. జగన్ ప్రభంజనం, తన నాయకత్వం కలిసొచ్చి ఉదయగిరి నియోజకవర్గం నుండి బంపర్ మెజార్టీతో గెలిచాడు.

వెంకటగిరి
**ఆనం రామనారాయణరెడ్డి, వైకాపా**
మెజార్టీ: 38,577



### విజయం ఊహించిందే

ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరి వెంకటగిరి నియోజకవర్గం నుండి ఆ పార్టీ అభ్యర్థిగా ఖరారైన రోజే ఆయన విజయం ఖాయమనుకున్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ ప్రభంజనంతో పాటు రామనారాయణరెడ్డి సొంత నాయకత్వం భారీ మెజార్టీకి కారణమైంది.

ఆత్మకూరు
**మేకపాటి గౌతమ్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 23,257



### ప్రజలు గెలిపించారు

జిల్లాలోకల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోట ఆత్మకూరు నియోజకవర్గం. ఈ ఎన్నికల్లో అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి ఎలక్షన్ సరిగా చేయలేదని ప్రచారం వచ్చినా వైసిపి సానుభూతిపరులు దానిని పరిగణనలోకి తీసుకోకుండా వైసిపిని విజయబాట పట్టించారు.

కావలి
**రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైకాపా**
మెజార్టీ: 13,789



### కొండల్ని ఢీ కొట్టాడు

ఓ పక్క బీద సోదరులు, మరోపక్క కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి... గట్టి ప్రత్యర్థులు. అయినా రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. వాళ్ళిద్దర్నీ సమర్థవంతంగా ఢీకొట్టాడు. వారి అంచనాలను పటాపంచలు చేస్తూ... కావలి నుండి సంచలన విజయం సాధించాడు.

---



### ఎంపి నుండి ఎమ్మెల్యేకి...

2014లో తిరుపతి లోక్‌సభ వైసిపి అభ్యర్థిగా గెలిచిన వెలగపూడి వరప్రసాద్... ఈ ఎన్నికల్లో గూడూరు రిజర్వ్‌డ్ అసెంబ్లీ నుండి వైసిపి అభ్యర్థిగా ఘనవిజయం సాధించాడు. జగన్ నాయకత్వంలో అసెంబ్లీలో అడుగుపెట్టనున్నాడు.

గూడూరు
**వరప్రసాద్**
**వైకాపా**
మెజార్టీ: 43,231

సర్వేపల్లి
**కాకాణి గోవర్ధన్‌రెడ్డి**
**వైకాపా**
మెజార్టీ: 13,866

### డబుల్ ధమాకా

సర్వేపల్లి నుండి వైసిపి అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా రెండోసారి ఘనవిజయం సాధించాడు. ఆయన గెలిచింది తెలుగుదేశం పార్టీలో రాజకీయ చాణుక్యుడిగా పేరుపొందిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కావడం విశేషం.



## 'ప్రభా'తం

# జాతీయవాదానికి జేజేలు

దీనిని తుఫాన్ అనవచ్చో... లేక సునామీ అనవచ్చో... తెలియదు గాని భారత రాజకీయ చరిత్రలో ఇలాంటి విక్టరీ ఎవరూ సాధించి ఉండరు. ఎందుకంటే ఐదేళ్ల పరిపాలన తర్వాత... తన పనితీరునే ఆధారం చేసుకుని ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికలకు వెళ్లడం... ప్రజలు 2014కు కంటే కూడా ఎక్కువ మెజార్టీని అందించడం పెద్ద అద్భుతం. గతంలో కాంగ్రెస్ ఇంతటి ఘనవిజయాలు సాధించినా... అవి ఇందిరాగాంధీ మరణం అనంతర సానుభూతిలోనో లేదా అంతకుముందు ఎమర్జెన్సీ తర్వాత నెలకొన్న వాతావరణం నేపథ్యంలోనే సాధించినవే!



కూటముల కలలు కల్లలయ్యాయి. ప్రతిపక్షాలను, ప్రాంతీయ పార్టీలను కలిపి కేంద్రంలో అధికారం చేపట్టాలన్న నరేంద్ర మోడీ వ్యతిరేకుల ప్రయత్నాలన్నీ ధ్వంసమయ్యాయి. గడ్డిపోచలను పోగుచేసి తాడులా పేని ఏనుగును బంధించాలనుకున్నారు... కాని విపక్షాలనే గడ్డిపోచలకు మోడీ అనే ఏనుగును బంధించే శక్తి చాలలేదు. ముఖ్యంగా అవసరాల కోసం, అవకాశం కోసం ఏర్పడే స్నేహాలను, రాజకీయ పొత్తులను ప్రజలు ఈసడించుకున్నారు. దేశంలో ప్రధానిగా నరేంద్ర మోడీకి సరితూగగల ప్రత్యామ్నాయ నాయకుడు ప్రజలకు కాగడాలు పెట్టి వెదికినా కనిపించలేదు. కనీసం దరిదాపుల్లో వున్న వాళ్ళు కూడా లేరు. రాహుల్, మమతా బెనర్జీ, మాయావతి, చంద్రబాబు, శరద్‌పవార్... నరేంద్ర మోడీతో వీరిని పోల్చి చూస్తే కొండకు బండకు ఉన్నంత తేడా. అందుకే దేశ ప్రజలు తమ రక్షకుడిగా రెండోవారిని ఊహించలేదు. అన్ని విధాలా 5ఏళ్లలో తన సమర్ధతను చాటుకున్న నరేంద్ర మోడీకే జైకొట్టారు.

భారత ప్రజలు మరోసారి చారిత్రాత్మక తీర్పునిచ్చారు. ఈ తీర్పు ఎలా వుందంటే... దేశ భద్రతను, జాతీయవాదాన్ని ప్రతిబింబించేలా, లౌకికవాదం ముసుగులో దేశ భద్రతతో చెలగాటమాడుతున్న కొన్ని రాజకీయ పక్షాలకు గూబ గుయ్‌మనిపించేలా వుంది. మే 23వ తేదీ భారత పార్లమెంట్‌కు జరిగిన ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకుగాను దాదాపు 350 స్థానాలలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) విజయదుంధుభి మోగించింది. హంగ్ ఫలితాల అంచనాలను తుడిచిపెట్టి పూర్తి ఆధిక్యతను సాధించింది. 2014 ఎన్నికల్లో 283 స్థానాలతో సొంతంగా మెజార్టీ సాధించిన బీజేపీ ఈసారి కూడా దాదాపు 300 సీట్లతో పూర్తి మెజార్టీని దాట గలిగింది. ఇక దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పరిస్థితి 2014 ఎన్నికలకంటే మెరుగు పడ్డప్పటికీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న నరేంద్ర మోడీ పిలుపు సాకారమయ్యే పరిస్థితుల్లో మాత్రం మార్పు లేనట్లేవుంది. ఇప్పటికే ముప్పావు భాగం రాష్ట్రాలలో కాంగ్రెస్ పూర్తిగా దెబ్బతింది. మిగిలిన రాష్ట్రాలలో కూడా ఆ పార్టీ ఇక నిలదొక్కుకోవడం కష్టమే! ఈ ఎన్నికల ఫలితాలతో దేశంలోనే బీజేపీ ప్రబల జాతీయ శక్తిగా మారిపోయింది.

దేశంలోని 29 రాష్ట్రాలకు 20కి పైగా రాష్ట్రాలలో బీజేపీ దాని మిత్రపక్షాలు ఆధిక్యత చూపించాయి. 2014తో పోలిస్తే యుపీలో బీజేపీకి స్వల్పంగా సీట్లు తగ్గినప్పటికీ పశ్చిమబెంగాల్, ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాల ద్వారా ఆ లోటును పూడ్చుకోగలిగింది.

1998 నుండి 2004 దాకా కేంద్రంలో ప్రధానిగా కొనసాగిన వాజ్‌పేయి ప్రభుత్వం ఆరోజు దేశంలో సానుకూల వాతావరణమున్నప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. తమ ప్రభుత్వ అభివృద్ధి మంత్రాన్ని గెలుపు మంత్రంగా మలచలేకపోయింది. కాబట్టి 2004 ఎన్నికల్లో ఓటమిని చూడాల్సి వచ్చింది. కాని, నరేంద్రమోడీ అలాంటి పొరపాట్లకు అవకాశమివ్వలేదు. అభివృద్ధిని, రాజకీయాన్ని ఆయన జోడు గుర్రాలుగా మలచి సవారీ చేశాడు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి ప్రతికూలతలను కేవలం ఏడాది కాలంలోనే అధిగమించేశాడు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ వంటి వాటితో, నోట్ల రద్దు ఇంకోసారి చేసినా బ్యాంకుల ముందు 'క్యూ'లో నిలుచోడానికి సిద్ధం... కాని పాకిస్థాన్ మెడలు వంచాల్సిందే అనే రీతిలో ప్రజలలో భావోద్రేకాలు వచ్చాయి. అవి మోడీకి ఓటు బ్యాంకుగా మారాయి. అదీగాక ఐదేళ్ళ మోడీ పాలనలో నోట్ల రద్దు ఒక్కటే ప్రధాన వైఫల్యంగా కనిపిస్తోంది. జిఎస్టీ క్రమంగా దారిలో పడుతోంది. దీనిమూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా తయారైంది. ప్రజల్లో జిఎస్టీపై అవగాహన రావడమే కాదు, పన్నులు కట్టడం మన బాధ్యత అనే చైతన్యం వచ్చింది. రైల్వే, విద్యుద్దీకరణ, రహదారులు వంటి మౌలిక వనరుల కల్పనలో ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో ప్రగతి సాధించింది. అనవసరమైన సబ్సిడీలకు అంటకత్తెర వేసి దుబారాను తగ్గించింది. దేశ ఆర్థిక వ్యవస్థపై వున్న అనవసరపు భారాలనెన్నింటినో తొలగించింది. అన్నింటిని మించి గత ఐదేళ్లలో భారత్ సాధించిన దౌత్య విజయాలు అనిర్వచనీయం. ప్రపంచ దేశాల దృష్టిలో భారత్ పట్ల వున్న చులకన భావాన్ని తొలగింపజేయడంలోనూ, భారత్‌ను అత్యంత ప్రాధాన్యత ఇవ్వగల దేశంగా తీర్చిదిద్దడంలోనూ మోడీ చేసిన కృషి మరువలేనిది. ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా పోరుకు నడుం కట్టిన మొదటి నాయకుడు మోడీనే! అన్ని దేశాలను ఆయన ఈ పోరులో భాగస్వాములను చేయగలిగాడు. ఆఖరకు హిందుత్వ పార్టీ ప్రతినిధిగా ముద్రపడి కూడా అరబ్ దేశాల నేతల మనసులు గెలుచుకున్నాడు.

అన్నింటికి మించి పాకిస్థాన్ విషయంలో మోడీ అనుసరించిన 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' వైఖరికి ప్రజలు జేజేలు పలికారు. యూపిఏ పదేళ్లలో దేశంలో ఏరోజు ఎక్కడ బాంబులు పేలుతాయో, ఎక్కడ ఉగ్రదాడి జరుగుతుందో తెలియని పరిస్థితి. మోడీ ఐదేళ్ళ పాలనలో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాడు. ఉగ్రదాడులకు ప్రతీకార చర్యలతో పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించాడు. ఉగ్రదాడులు జరిగినప్పుడు గత పాలకులు లాగా శాంతి వచనాలు వల్లించలేదు. ప్రతిదాడులతో గట్టిగా సమాధానం చెప్పాడు. ఆఖరకు పాకిస్థాన్ చేతికి బందీగా చిక్కిన పైలట్ అభినందన్ వర్ధమాన్‌ను బ్రతిమలాడి కాకుండా, బెదిరించి విడిపించిన దమ్ము దేశ ప్రజలకు నచ్చింది. అంతేకాదు, ఐదేళ్ళ మోడీ పాలనలో ఎటువంటి అవినీతి కుంభకోణాలు లేవు. ఆయన చేతిలో దేశం భద్రంగా వుంది. ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా వుంది. దేశం అభివృద్ధి పథాన దూసుకుపోతోంది. అవినీతి రహిత పరిపాలన కొనసాగుతుంది. ప్రజలు కోరుకునేది ఇలాంటి పాలనే. కాబట్టే దేశ ప్రజలు మరోసారి మోడీకి జై కొట్టారు. ఆ జై కొట్టడం కూడా అట్లా ఇట్లా లేదు... విపక్షాల దిమ్మ తిరిగేలా కొట్టారు. నిజాయితీ పరిపాలనకు, అవినీతికి తావులేని నాయకత్వానికి ఎంతటి ఆదరణ ఉంటుందన్నది దేశ ప్రజలు కులమతాలకతీతంగా చూపించారు.

## వైభవంగా కాశీవిశ్వనాథస్వామి రథోత్సవం

నెల్లూరు ఉస్మాన్ సాహెబ్ పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19 న జరిగిన శ్రీస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేవదేవేరులను విశేష పుష్పాలంకారంతో అలంకరించి రథంపై కొలువుతీర్చారు. భక్తులు శివనామస్మరణలతో రథోత్సవం స్వామి వారి సన్నిధి నుంచి బయలుదేరి రేబాలవారివీధి, స్టోన్ హౌస్ పేట మెయిన్ రోడ్డు, తడికల బజార్ సెంటర్ మీదుగా తిరిగి దేవస్థానానికి చేరుకుంది. రథంలో సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు. కర్పూర హారతులు ఇచ్చి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. రథోత్సవానికి ఉభయకర్తులుగా మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ, పత్తి జయరామయ్య నాయుడు, పద్మావతమ్మ దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహాణాధికారి జానకమ్మ, ధర్మకర్తమండలి ఛైర్మన్ కండే సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ కొలపర్తి వెంకట రమేష్ కుమార్, ధర్మకర్తమండలి మాజీ సభ్యులు పర్యవేక్షించారు.

## భగవంతుని భక్తితో సేవించుకోవాలి

**- డా. శుకదేవస్వామి**



భక్తితో భగవంతుని సేవించుకోవాలని, అప్పుడే ఆ భగవంతుని కరుణ మనకు లభిస్తుందని నెల్లూరులోని ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డా. శుకదేవస్వామి అన్నారు. నరసింహ జయంతి సందర్భంగా ఈనెల 18న ఇస్కాన్‌లో జరిగిన వేడుకలో ఆయన మాట్లాడుతూ ప్రహ్లాదుడు ఆ భగవంతుని పట్ల అనన్యభక్తితోనే అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నాడని ఉదహరించారు. తొలుత మందిరంలో నరసింహ స్వామిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేసి భజనలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఇస్కాన్ విద్యార్థులు ప్రదర్శించిన 'భక్తప్రహ్లాద' నాటకం అందరినీ బాగా ఆకట్టుకుంది.




## సమర్ధుడికే పట్టం

భారత ప్రజలు మరోసారి తమ విజ్ఞత చాటుకున్నారు. కులం, మతం, వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూడా దేశ ప్రయోజనాలు, దేశ భద్రతకే ప్రాధాన్యతనిచ్చారు. దేశాన్ని ఎవరైతే రక్షించగలరో వారికే వెన్నుదన్నుగా నిలిచారు. ప్రధాని మోడీపై ప్రజలు విశ్వాసం ఉంచారు. పూర్తి మెజార్టీతో ఎన్డీఏను తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారు. ఎన్డీఏ గెలుపులో ప్రధాన పాత్ర ప్రధాని నరేంద్ర మోడీదే! గత ఐదేళ్లలో ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టారు. మంచి ఫలితాలను రాబట్టారు. ఆయన సాధించిన దౌత్య విజయాలు దేశ ప్రతిష్టను నిలబెట్టాయి. గత చరిత్రలో ప్రపంచ దేశాలలో భారత్‌కు ఎప్పుడూ లేనటువంటి ప్రాధాన్యత ఇప్పుడు పెరిగిందంటే కారణం మోడీనే! మరో ఐదేళ్ళు ఆయన పరిపాలనలో 'దేశం' రూపురేఖలు ఇంకా ఎంతో బాగా మార్పు చెందుతాయి.

**జి.ఎస్.రావు, నెల్లూరు.**

## ప్రజాభిమానం నిలబెట్టుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ప్రజలు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని ఆదరించారు. తమ పరిపాలకుడిగా అవకాశం కల్పించారు. జగన్మోహన్‌రెడ్డి తనకొచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. చంద్రబాబు లాంటి చెత్త పరిపాలనకు అవకాశమివ్వొద్దు. ప్రజాధనాన్ని చంద్రబాబులాగా దుర్వినియోగం చేయకుండా సద్వినియోగపరచండి.

**కాటంరెడ్డి సతీష్, నెల్లూరు.**

## శెభాష్ ఈసి

దేశ వ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు, నాలుగు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించడంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఎంతో సమర్థవంతంగా పనిచేసింది. మొత్తం ఏడు దశల్లో పెద్దగా హింసాత్మక ఘటనలు తలెత్తకుండా ఎన్నికలు జరిపిన విధానం అభినందనీయం. పశ్చిమబెంగాల్ వంటి హింసాత్మక రాష్ట్రాలలో ఏడు దశలలో వ్యూహాత్మకంగా పోలింగ్ జరిపిన తీరు ప్రశంసనీయం.

**కోనేరు ప్రసాద్, చీరాల.**

## కమల్ పిచ్చివాగుడు

కమల్‌హాసన్, ప్రకాశ్‌రాజ్‌లాంటి వాళ్ళకు హిందుత్వంపై విషం కక్కడం నైజంగా మారిపోయింది. వీరి పిచ్చివాగుడు వల్ల ప్రజల్లో అనవసరమైన భావోద్వేగాలు చోటుచేసుకుంటున్నాయి. గాంధీని చంపిన గాడ్సేను తొలి హిందూ తీవ్రవాది అంటూ కమల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ దేశంలో గాడ్సేను ద్వేషించే వాళ్ళే కాదు, అభిమానించే వాళ్ళు కూడా వున్నారు. దేశ విభజనకు ప్రధాన కారకులు గాంధీ, నెహ్రూలే! పాకిస్థాన్‌లో లక్షలాది మంది హిందువుల ఊచకోతకు కారకులు వీళ్ళే! బ్రిటీషోళ్ళపై ఎందరో పోరాడి ప్రాణాలు కోల్పోతే ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసు కున్నది గాంధీ, నెహ్రూలే! ఈరోజు దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యలకు కారణం వీళ్ళిద్దరే! ముఖ్యంగా హిందువులకు గాంధీ ద్రోహం చేసాడనే గాడ్సే ఆ దారుణానికి ఒడిగట్టాడు. గాడ్సేకు ఈ సంఘటనకు ముందు ఎలాంటి నేర చరిత్ర లేదు.

**సి.రాజీవి, నెల్లూరు.**


హృదయపూర్వక
శుభాకాంక్షలు
రాష్ట్ర రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టించి
సంచలన విజయంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా
ప్రమాణస్వీకారం చేయనున్న జననేత, ప్రజాహృదయ విజేత
శ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు.
బత్తిని విజయకుమార్
వైయస్సార్‌సీపీ నాయకులు, గూడూరు.

# పంచాయితీ యుద్ధానికి జాబితా సిద్ధం!

అసెంబ్లీ ఎన్నికలు ముగియడం, ఫలితాలు రావడం, వారం రోజుల్లోపే కొత్త ప్రభుత్వం ఏర్పడడం అంతా జరిగిపోయింది. కొత్త ప్రభుత్వానికి మొదటి పని స్థానిక ఎన్నికలను వెనువెంటనే జరిపించడం. ఇందులో మొదటి అంకం పంచాయితీ ఎన్నికలు. జిల్లాలో 940 పంచాయితీలు వుండగా, గతంలో 931 పంచాయితీలకు ఎన్నికలు జరిగాయి. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 9 పంచాయితీల సంగతి కోర్టులో పెండింగ్‌లో వుంది. ఈ 931పంచాయితీల పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడాదిపైనే అయ్యింది. అప్పటినుండి ఇన్‌ఛార్జ్‌ల పాలనలో నడుస్తున్నాయి. గట్టిగా ఇంకో రెండు నెలల్లోపే పంచాయితీ ఎన్నికలుండొచ్చు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయితీ అధికారులు 931 పంచాయితీలలో అందులోని 8834 వార్డులకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధంచేశారు. సవరించిన జాబితాల ప్రకారం 16,45,439 మంది ప్రస్తుతం ఓటర్లుగా నిర్ధారించారు. ఇందులో 8,35,412 మంది మహిళా ఓటర్లుండగా, 8,09,842 మంది పురుషులున్నారు. 185మంది థర్డ్‌జెండర్ ఓటర్లుగా నమోదయ్యారు. 2013 పంచాయితీ ఎన్నికల్లో 13,92,172 ఓట్లుండగా ఈ ఆరేళ్ళకు 2,53,267 ఓట్లు పెరగడం విశేషం.

## కార్టూనిస్ట్ రామశేషుకు
# బాపు-రమణ పురస్కారం



'బాపు-రమణ' పురస్కారాన్నందుకుంటున్న రామశేషు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ మోపూరు రామశేషుకు ఎంతో విశిష్టమైన బాపు రమణ పురస్కారం లభించింది. తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామశేషు ఈ ఘనసత్కారాన్ని అందుకున్నారు. సత్కళా భారతి, హాస్యానందం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు రమణాచారి, ప్రముఖ సినీనటుడు తనికెళ్ళ భరణి, బాపు-రమణ అకాడమీ నిర్వాహకుడు వేగిరాజు తదితరులు పాల్గొని రామశేషును ఘనంగా సత్కరించి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ప్రముఖ కవులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధర బాబులు రామశేషును అభినందించారు.

## బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి
# రాజమండ్రిలో సన్మానం



సత్కారాన్నందుకుంటున్న కవి బొగ్గరపు రాధాకృష్ణ

తూర్పు గోదావరిజిల్లాలోని శ్రీ స్వర్ణభారతి సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీలో నెల్లూరుకు చెందిన కవి బొగ్గరపు రాధా కృష్ణమూర్తి కవితకు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఈనెల 19న రాజమండ్రిలో జరిగిన జాతీయ శతకవి సమ్మేళనంలో పాల్గొన్న రాధాకృష్ణ మూర్తిని నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. ఆనం రోటరీ హాల్‌లో జరిగిన ఈ సభా కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ సభ్యులు డా.కె. ప్రతాప్, స్వర్ణభారతి వ్యవస్థాపకులు దొండపాటి రాజారావు, మద్దా సత్యనారాయణ తదితరులు పాల్గొని బొగ్గరపు కవితా ప్రతిభను ప్రశంసిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొగ్గరపును ఆచార్య ఆదిత్య, ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, దుప్పటి రమేష్, నల్లు రమేష్, డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు అభినందించారు.

## కలెక్టర్‌చే విజయదుర్గకు
# కవితా కుసుమం పురస్కారం



నెల్లూరు వనంతోపుకు చెందిన ప్రముఖ రచయిత్రి ములుగు విజయదుర్గ (వినీల) జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు చేతుల మీదుగా కవితా కుసుమం పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కలెక్టర్ అందజేసి మాట్లాడుతూ విజయదుర్గ సింహపురి సాహిత్య కెరటంలా, పెన్నానది రస ప్రవాహంలా, గృహిణిగా వుంటూ చిన్ననాటి నుండి కవితలు రాస్తూ సమాజానికి దర్పణంలా, ఆలోచించే విధంగా వుండడం అభినంద నీయమన్నారు. తెలంగాణా గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈ పురస్కారానికి 48ఎంట్రీలు వచ్చాయని అందులో విజయదుర్గ (వినీల) సాహిత్యాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. పురస్కార గ్రహీత విజయ దుర్గ మాట్లాడుతూ సాహిత్య పురస్కా రాలు ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తా ఆలోచనలకు పదును పెట్టేవిగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా శాలువ, పురస్కార ఎంపిక పత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా దుర్గకు అందజేశారు.






# నెల్లూరు కబుర్లు

## మద్యంకు, గదులకు కొరత

ఈ నెల 23వ తేదీన ఎన్నికల కౌంటింగ్ రోజున నెల్లూరు నగరంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు హోటళ్లలో గదులకు, మద్యంకు తెగ ఇబ్బంది పడ్డారు. కౌంటింగ్ నేపథ్యంలో 22వ తేదీ సాయంత్రం నుండే నగరంలో మద్యంషాపులను మూసేయించారు. 23వ తేదీ కూడా తీయలేదు. ఇక డికెడబ్ల్యు కాలేజీ, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీ లలో కౌంటింగ్ పెట్టడంతో ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు నగరంలోని పలు హోటళ్లలో గదులను ముందుగానే బుక్ చేసుకున్నారు. పెళ్ళిళ్ళ సీజన్ కావడంతో చాలామందికి గదులు దొరకలేదు. ఇక రూమ్‌లలో దిగిన వాళ్ళు మద్యంతో సేద తీరుదా మనుకుంటే అది కూడా దొరకలేదు. కొంతమంది ముందుగానే మద్యాన్ని కొనుగోలు చేసి జాగ్రత్త పడివుండడంతో దాంతోనే సర్దుకున్నారు.

# రంగనాధునికి వసంతోత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేటలో పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా కీర్తింపబడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 24వ తేది శుక్రవారం నుండి 26వ తేదీ ఆదివారం వరకు వసంతోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. ఈ మూడు రోజులు సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామివారికి నవకలశ స్నపన తిరుమంజనం(అభిషేకము), 6 గంటలకు శ్రీస్వామి వారికి విశేష పుష్పాలంకారం, దివ్యప్రబంధ గోష్టి, ఆస్థాన సేవ, రాత్రి 7.30 గంటలకు తీర్థప్రసాద వినియోగం, 8 నుండి 8.30 గంటల వరకు ప్రాకా రోత్సవం తదితర విశేష పూజలు జరుగుతాయ న్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## గ్రీవెన్స్‌కు..
# జనం రావడం లేదు

భగ్గుమంటున్న ఎండలదెబ్బకు ప్రతి సోమవారం కలెక్టరేట్, జిల్లా ఎస్పీ ఆఫీసు, ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల దినాలు వెలవెలబోతున్నాయి. ఎండల ధాటికి జనం ఇల్లు, ఊరు దాటి రావడం లేదు. ఇంతకుముందు గ్రీవెన్స్‌డే రోజున కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు కిటకిటలాడు తుండేవి. గత మూడువారాలుగా బాధితులు తగ్గి పోయారు. ఎండలు తగ్గితేగాని గ్రీవెన్స్‌డేకు మళ్ళీ బాధితులు క్యూ కట్టి వచ్చేలా లేరు.

## ప్రభుత్వాసుపత్రిలో..
# అన్నదానం చేసిన 'ఫ్రెండ్స్ వాకర్స్'



అన్నదానం నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న నెల్లూరులోని డిఎస్ఆర్ ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం జరిగింది. సత్యసాయి సేవాట్రస్ట్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బల రామయ్యనాయుడు మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగు లతో పాటు వారికి తోడుగా ఉన్న కుటుంబసభ్యులకు కూడా అన్నదానం చేశామన్నారు. తన 40వ వివాహ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని, తమ కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా ప్రజలతో కలిసి నిర్వహించుకునేలా నిర్ణయించుకున్నామని, అందులో భాగంగానే ఈ వితరణ చేపట్టామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యాయులు జివి కృష్ణయ్య, వాకర్స్ డిప్యూటీ గవర్నర్ పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి, కార్యవర్గసభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసమూర్తి, రాఘవేంద్రశెట్టి, పొన్నం రవిచంద్ర, ఓబుల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

# సమాజాన్ని మేల్కొలిపేది.. జర్నలిజమే!

## - డాక్టర్ సి.వి సుబ్రహ్మణ్యం



నారద మహర్షి జయంతి సభలో సత్కారాలనందుకున్న సీనియర్ జర్నలిస్టులు

అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతూ సమాజాన్ని మేల్కొలిపే శక్తి జర్నలిజానికే ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.వి సుబ్రహ్మణ్యం అన్నారు. భారత్ ప్రకాశన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు లోని జయభారత్ ఆసు పత్రిలో ఈనెల 19న జరిగిన నారద మహర్షి జయంతి సభలో ఆయన మాట్లాడుతూ నారద మహాముని వైశిష్ట్యం గురించి వివరించారు. నారదుడు లోకకల్యాణం కోసం అవతరించిన మహనీయుడని, కలహభోజనుడు కాదని అంటూ పురాణకాలంలో అవతరించిన నారద మహర్షి త్రిలోక సంచారం చేస్తూ అన్ని లోకాల్లోని విషయాలను అందరికీ తెలియజేయడం ద్వారా ఆ కాలంలోనే జర్నలిస్టుల పాత్రను పోషించి అందరికీ మార్గదర్శకుడయ్యాడని కొనియాడారు.

ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్ మాట్లాడుతూ నేటి కాలంలో ఎందరో జర్నలిస్టులు నిజాయితీగా జర్నలిజంలో రాణిస్తున్నారన్నారు. మరెందరో జర్నలిస్టులు విధి నిర్వహణలో మరణిస్తున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు.

అనంతరం సీనియర్ పాత్రికేయులు పి. రాజశేఖర్, ఈతకోట సుబ్బారావు, లాయర్ వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. గుర్రం సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ సభలో జయభారత్ ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్, ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, దొర్నాదుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# సాంకేతిక శిఖరం రాజీవ్

## ఇందిరాభవన్‌లో జరిగిన 28వ వర్ధంతి సభలో చేవూరు

ఈ నెల 21వ తేదీన మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 28వ వర్ధంతిని నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ పక్షాన నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, భవాని నాగేంద్రప్రసాద్, షేక్ ఫయాజ్, లేళ్ళపల్లి సురేష్‌బాబు, చింతాల వెంకట్రావ్, రఘురామ్ ముదిరాజ్, టి.బాలసుధాకర్, షబ్బీర్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, లతారెడ్డి, అనురాధ తదితరులు పాల్గొని రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి ఐటి రంగాన్ని పరిచయం చేసి, కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులకు బీజం వేసింది రాజీవ్ గాంధీయేనన్నారు. 18ఏళ్ళకే ఓటు హక్కు కల్పించి యువతకు ప్రాధాన్యతనిచ్చింది, కేంద్రం నుండి పంచాయితీలకు నేరుగా నిధులు వచ్చేలా చేసి గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేసింది ఆ మహానుభావుడేనని పేర్కొన్నాడు. ప్రధాని నరేంద్ర మోడీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజీవ్‌గాంధీపై బురద చల్లుతుండడం పెద్ద దుర్మార్గపు చర్యగా చేవూరు పేర్కొన్నాడు.

# 'జై జవాన్ - జై కిసాన్' రాకెట్ ఇది



- అన్నదాత కోసం, దేశాన్ని రక్షించే జవాన్‌ల కోసం కక్ష్యలోకి దూసుకెళ్లిన రీశాట్-2బి
- పిఎస్ఎల్‌వి-సి46 విజయవంతం

ఇప్పటివరకు వివిధ రంగాలలో పురోగతి కోసం ఇస్రోవాళ్ళు ఎన్నో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించారు. ఈ ఉపగ్రహాల ద్వారా ఆయా రంగాలలో ప్రజా సేవలను మెరుగు పరుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దేశానికి వెన్నెముకలాంటి అన్నదాతల కోసం ఓ ఉపగ్రహాన్ని రూపొందించి అంతరిక్షంలోకి దిగ్విజయంగా సాగనంపారు.

ఈనెల 22వతేదీ బుధవారం తెల్లారుజామున నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్)లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుండి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి46 విజయవంతమైంది. మొత్తం 15నిముషాల 25సెకండ్ల ప్రయోగంలో 615కిలోల బరువైన రాడార్



ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ రీశాట్-2బిని భూమికి 557 కిలోమీటర్ల ఎత్తులో భూమధ్య రేఖకు 37 డిగ్రీల వాలులోని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. బూస్టర్‌లు కాకుండా పిఎస్ఎల్‌వి కోర్ అలోన్ తరహాలో ఈ రాకెట్ ప్రయోగం జరిగింది. పిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది 48వ ప్రయోగం కావడం విశేషం.

రీశాట్-2బి ద్వారా దేశ రక్షణకు, అలాగే వ్యవసాయానికి సంబంధించిన సమాచారం అందనుంది. ఈ ఉపగ్రహంలో వున్న ఎక్స్‌బాండ్ రాడార్ ద్వారా దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా వుంటుంది. ఉగ్రవాద శిబిరాలు, ఉగ్రవాదుల కదలికలు, శత్రుదేశ సైనికుల దురాక్రమణలను ఎప్పటికప్పుడు పసిగడుతూ దానికి సంబంధించిన ఛాయాచిత్రాలను మనకు పంపిస్తుంది. అలాగే ప్రకృతి విపత్తులను గురించిన సమాచారాన్ని ముందుగా తెలియజేస్తుంది. వ్యవసాయ, అటవీ రంగాలకు చెందిన సమాచారాన్ని చేరవేస్తుంది. 'జై జవాన్ - జై కిసాన్' అన్న స్ఫూర్తితో ఈ ఉపగ్రహాన్ని రూపొందించినట్లుగా వుంది. ఇస్రో ఛైర్మెన్ శివన్ పర్యవేక్షణలో ప్రయోగం విజయవంతమైంది.

## నెల్లూరులోనూ కనిపించిన రాకెట్

షార్‌లో ఎప్పుడు రాకెట్ ప్రయోగాలు జరిగినా అక్కడి దగ్గర్లో వున్నవారికి మాత్రమే కనిపిస్తుంది కానీ, నెల్లూరు నగరం వరకు ఎప్పుడూ కనిపించేది కాదు. కాని, బుధవారం తెల్లారుజామున 5.31గంటల ప్రాంతంలో ఆకాశంలో పొగలు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న పిఎస్ఎల్‌వి-సి46 రాకెట్ నెల్లూరు నగరవాసులను అబ్బురపరిచింది. ఆ సమయంలో వాకింగ్‌కు, ఇతర పనుల నిమిత్తం రోడ్ల మీదకు వచ్చినవారు ఆకాశంలో దూసుకెళ్తున్న రాకెట్‌ను చూసి మొదట విమానంగా భావించారు. అయితే కొన్ని సెకండ్లలోనే అది మాయం కావడంతో అప్పుడు అది రాకెట్ అన్నది స్ఫురించింది. షార్‌కు వెళ్ళలేకపోయినా నగరంలోనే రాకెట్ ప్రయోగం తిలకించే అవకాశం కలిగిందని నెల్లూరువాసులు ఆనందపడ్డారు.




సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది
పూండ్ల చెంచురెడ్డి గారు
పరమపదించి తేది. 27.05.19 నాటికి
ముప్పైఒక్క సంవత్సరాలు నిండుతాయి.
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

భార్య :
పూండ్ల కామేశ్వరమ్మ

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి

మరియు
కుటుంబసభ్యులు

# సెంటిమెంట్ పనిచేసింది

## విపిఆర్‌ది లక్కీ హ్యాండ్ అని తేలింది



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సాధించిన విజయం కనీవిని ఎరుగనిది. ఈ విజయం వెనుక ఆయన కష్టం, కన్నీళ్ళు, ఎన్నో కోట్ల మంది శ్రమ, ఆశలు, ఆశయాలు వున్నాయి. వీటన్నింటికీ కొంత సెంటిమెంట్ కూడా తోడైవుంటుంది. ఆ సెంటిమెంట్ పేరే... వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. తన శ్రమతో పాటు భగవంతుడిని నమ్మిన వాడు. కల్మషం లేని మనిషి. ఆయన చేత్తో ఏ పని ప్రారంభించినా మంచి జరుగుతుందనే పేరుంది. ఆ హస్తవాసిని వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కూడా నమ్మాడు. అందుకే ఈ ఎన్నికల్లో తొలి 9మంది పార్లమెంటు అభ్యర్థుల జాబితాను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేత చదివించారు. ఆయన నిండు మనసుతో చదివాడు. సీట్లు కూడా నిండుగా వచ్చాయి.

# బాబు జీవితంలో మరచిపోలేని '23'



23... ఈ సంఖ్యకు ప్రస్తుత రాజకీయాలలో తెగ ప్రాధాన్యత వచ్చింది. దీనికి కారణం చంద్రబాబే! తాను అధికారంలో వుండగా ఆయన ప్రతిపక్షం వైసిపిలో వున్న 23మంది ఎమ్మెల్యేలను కొన్నాడు. అలాగే 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడింది కూడా మే 23వ తేదీనే కావడం విచిత్రం కాగా, ఇదే రోజున వైయస్ జగన్మోహన్ రెడ్డి తాత, వై.యస్.రాజశేఖరరెడ్డి తండ్రిగారైన వై.యస్. రాజారెడ్డి వర్ధంతి కావడం ఇంకో వండర్. అనుకోకుండా ఒక తేదీతో ఎన్ని సెంటిమెంట్లు ముడిపడ్డాయో!

# ఇస్రో సేవలో శ్రీసిటి

## శ్రీసిటీ వి.ఆర్.వి కంపెని తయారు చేసిన ద్రవ హైడ్రోజన్ నిల్వ ట్యాంకును లాంఛనంగా స్వీకరించిన ఇస్రో




శ్రీసిటిలోని వి.ఆర్.వి ఆసియా పసిఫిక్ ఉత్పత్తి కర్మాగారంలో తయారైన, దేశంలోనె అతిపెద్ద ద్రవ హైడ్రోజన్ నిల్వ ట్యాంకును భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అద్యక్షులు డా.కె.శివన్ లాంచనంగా స్వీకరించారు. ఈనెల 22వతేదీ వి.ఆర్.వి కంపెని ఆవరణలో జరిగిన కార్యక్రమంలో, ఇస్రోకు సంబంధించిన ఉన్నతాధికారుల సమక్షంలో డా.శివన్, ట్యాంకు రవాణా వాహనానికి పచ్చ జండా ఊపారు. ఈ ట్యాంకును శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ద్రవ హైడ్రోజన్ ఇంధనాన్ని నిల్వ చేయటానికై ఉపయోగిస్తారు. తొలుత వి.ఆర్.వి మేనేజింగ్ డైరెక్టర్ జి.ఎల్.రంగనకేర్ డా. శివన్ మరియు ఇతర సీనియర్ అధికారులకు స్వాగతం పలికారు. శ్రీసిటీ తరపున శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ సుబ్రహ్మణ్యం డా. శివన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్యాంక్ యొక్క సాంకేతిక వివరాలు మరియు దాని తయారీ గురించి సంగ్రహంగా వివరిస్తూ, తమకు పూర్తి సహకారం అందించిన ఇస్రో ఇంజనీర్లకు రంగనకేర్ ధన్యవాదాలు తెలిపారు. ద్రవ హైడ్రోజన్ నిల్వ ట్యాంక్‌ను పూర్తి దేశవాళీ పరిజ్ఞానంతో రూపొందించి ఇస్రోకు అందించినందుకు డా. శివన్ వి.ఆర్.వి ఆసియా పసిఫిక్ మరియు ఇతర బృందాలను అభినందించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# అంబరాన్నంటిన విజయోత్సవాలు



నెల్లూరు ఎంపీగా విజయం సాధించిన ఆదాలను అభినందిస్తున్న అనుచరులు




తిరుపతి ఎంపిగా విజయం సాధించిన అనంతరం ఎన్నికల అధికారి వెట్రి సెల్వీ నుండి ధృవీకరణ పత్రాన్నందుకుంటున్న బల్లి దుర్గాప్రసాద్



గూడూరులో ఫలితాల సరళి విశ్లేషణ



ఆనందోత్సాహాలతో గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పొణకా దంపతులు

నెల్లూరు, తిరుపతి లోక్‌సభ స్థానాలతో పాటు జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. నెల్లూరు నగరంతో పాటు కావలి, గూడూరు, ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, రాపూరు, వెంకటగిరి, పొదలకూరు, కోవూరు, బుచ్చి, కలిగిరి తదితర ప్రాంతాలలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చడమే కాకుండా మిఠాయిలు పంచుకున్నారు. వైసిపి జెండాలతో కేరింతలు కొడుతూ బైక్ ర్యాలీలు నిర్వహించారు.

# టెన్షన్ పెట్టిన నెల్లూరు



రాష్ట్రంలో 150 అసెంబ్లీలలో వైసిపి సునాయాసంగా గెలిచింది. అభ్యర్థులెవరు టెన్షన్ లేకుండా గెలిచారు. అయితే వైసిపి అభ్యర్థులలో చివరి రౌండ్ వరకు టెన్షన్ పెట్టిన నియోజకవర్గం నెల్లూరు నగరం. ఈ నియోజకవర్గం తీవ్ర ఉత్కంఠత రేపింది. నెల్లూరు సిటి నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్ మొదట ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. అయితే మూడు రౌండ్ల కౌంటింగ్ తర్వాత ఫలితాలలో హెచ్చుతగ్గులు రాసాగాయి. మెజార్టీలు మారసాగాయి. వైసిపికి మంచి మెజార్టీ వస్తుందని అంచనా వేసిన నెల్లూరు పడమర నగరంలో ఆశించిన మెజార్టీ రాలేదు. తెలుగుదేశం అభ్యర్థి పి.నారాయణకు కొన్ని రౌండ్లలో ఊహించని మెజార్టీ రావడంతో 14వ రౌండ్ పూర్తయ్యేసరికి ఇద్దరి మధ్య నువ్వా-నేనా అనే పరిస్థితి వచ్చింది. అయితే 15, 16 రౌండ్లలో ఆదిత్యనగర్, ఎలమవారిదిన్నె వంటి ప్రాంతాలు రావడం, అక్కడ వైసిపికి ఆధిక్యత రావడంతో అనిల్‌కుమార్ చివరి రౌండ్ ద్వారా గెలుపు గుర్రమెక్కాడు. జిల్లాలో చివరి వరకు ఉత్కంఠత రేపిన ఫలితమిదే! రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల వైసిపి కార్యకర్తలు అనిల్ గెలిచాడా లేడా అంటూ ఎంతో ఆతృతగా ఆరా తీస్తూ వచ్చారు.

# ఎన్టీఆర్ తర్వాత జగనే!

## రాష్ట్ర రాజకీయ చరిత్రలో అరుదైన ఘనత



ఏపి రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ తర్వాత సొంతంగా పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన ఘనత జగన్‌దే! వై.యస్.రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్ నుండి ముఖ్యమంత్రి అయినవాడే! 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశంను స్థాపించి తొలి ప్రయత్నంలోనే అధికారంలోకి వచ్చాడు. అయితే, జగన్ పార్టీ పెట్టాక జరిగిన 2014 ఎన్నికల్లో అధికారంలోకి రాలేక ప్రతిపక్ష నేతగా పరిమితం కాగా, రెండో ప్రయత్నంలో అధికారంలోకి వచ్చాడు. అయితే ఎన్టీఆర్ కేవలం సినిమా గ్లామర్‌తో పార్టీని గెలిపించుకోగా, జగన్ కేవలం తన పోరాట పటిమ, సమర్ధ నాయకత్వ లక్షణాలతో పార్టీని అధికారంలోకి తీసుకురావడం విశేషం.



# శ్రీకాళహస్తి న్యూస్

## శాంతారామ్ జె పవార్‌కు...

# కన్నీటి నివాళి



శ్రీకాళహస్తి పురపాలక సంఘం అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పనిచేసి, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయానికి పాలక మండలి అధ్యక్షునిగా ఎంతోకాలం పాటు ధార్మికసేవలందించిన ధన్యజీవి శాంతారామ్ జె పవార్ మృతి తీరని లోటని శ్రీకాళహస్తిలోని ప్రముఖులు, ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. అజాతశత్రువుగా, మంచి పరిపాలనాదక్షునిగా పేరొందిన శాంతారామ్ జె పవార్‌ను కోల్పోవడం తమకెంతో ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇటీవలే వారి శ్రీమతి, వారి పెద్దక్కయ్య శివసాయుజ్యం పొందడంతో ఆయన కలతచెందారని, అయినా ఎలాగో కోలుకుంటున్నారని అనుకుంటున్న తరుణంలో ఆయన పరమపదించడం తమకెంతో ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. పరమశివుడు ఆ పుణ్యమూర్తిని తనలో శివైక్యం చేసుకోవాలని వారు ప్రార్ధించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

శ్రీను గల్పిక

# లోకేష్ లాజిక్‌కు షాకైన టీడీపీ నేతలు

మే 17వ తేదీ... ఢిల్లీలోని ఏపి భవన్... అందులోని ఒక హాల్‌లో హైటెక్ రత్న, ఆంధ్రా సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు ములాయంసింగ్ యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, శరద్‌పవార్, మమతా బెనర్జీ, మాయావతి, స్టాలిన్, దేవేగౌడ, సీతారాం ఏచూరి తదితరులున్నారు. చంద్రబాబు సీతారాం ఏచూరి గడ్డం పట్టుకుని... బాబ్బాబు... ఈ ఒక్కసారికి మద్దతివ్వండి... ఆ బీజేపీని అధికారంలోకి రాకుండా చేద్దాం... అని బ్రతిమలాడుతుంటే, ఇంకో పక్క స్టాలిన్ దేవేగౌడ పాదాలు పట్టుకుని... సార్, మీరే ఎలాగైనా కాపాడాలి, ఆ బీజేపీని అధికారంలోకి రాకుండా చూడాలి. ఈ ఒక్కసారికి ప్లీజ్ అంటూ వేడుకుంటున్నారు. అప్పుడే అక్కడకు సోనియా, రాహుల్‌గాంధీలు వచ్చారు. అక్కడ సీన్‌లు చూసి... ఏమిటి చంద్రబాబు ఇది, వాళ్ళు మనవాళ్ళేగా వాళ్ళను ఎందుకు బ్రతిమలాడుతున్నారు అని అడిగింది. అందుకు చంద్రబాబు... వాళ్ళు మన వాళ్ళేనన్న సంగతి నాకు తెలుసు మేడమ్... కాని రేపు 23వ తేదీన ఫలితాలు వెలువడి హంగ్ వస్తే, బీజేపీని నిలువరించడానికి ప్రాంతీయపార్టీల నేతల మద్దతు కోసం ఎలా బ్రతిమలాడు కోవాలి, ఏ విధంగా కాళ్ళు పట్టుకోవాలి అనే అంశంపై మనవాళ్ళకు ట్రైనింగ్ ఇస్తున్నామ్ మేడమ్ అని చెప్పాడు. అది విని సోనియా.... వెరీగుడ్ బాబూ... నీ ప్రయత్నాలు చూస్తుంటే మనకు మెజార్టీ రాకపోయినా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనే నమ్మకమొస్తుంది అని చెప్పింది. మాయావతి వచ్చి... అన్ని పార్టీల వాళ్ళం కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం సరే.... ప్రధాని పదవి, ఇతర పదవుల సంగతేంటో తేల్చండి అని అడిగింది. అది విని సోనియా... బాబు గారు, పదవుల విషయం ఏం చేద్దామంటారు అని అడిగింది. దానికి చంద్రబాబు... నాతోసహా ప్రధాని పదవికి రేస్‌లో చాలామంది వున్నారు మేడమ్... కాబట్టి రేస్‌లో వున్న నాయకుల పేర్లన్నీ చీటీల మీద వ్రాసి డబ్బాలో వేసి లాటరీ తీద్దాం. ఎవరి పేరొస్తే వాళ్ళే ప్రధాని, అలాగే ఉపప్రధాని పదవులను కూడా పార్టీ కొకటి లెక్కన ఇద్దాం అని ప్రతిపాదించాడు. అందుకు మాయావతి ఈ ప్రతిపాదన నాకు ఓకే... అయితే విద్య, ఉద్యోగాలలో వున్నట్లే ఈ లాటరీ విషయంలో కూడా దళితులకు ప్రత్యేక రిజర్వేషన్ పెట్టాలి, ప్రధాని పదవికి రేస్‌లో వున్నోళ్ళవి ఒక్కొక్కరి పేరుతో ఒక చీటీ వేయండి... దళితురాలినైన నాకు రిజర్వేషన్ వర్తిస్తుంది కాబట్టి నా పేరుతో నాలుగు చీటీలు వ్రాసి డబ్బాలో వేసి లాటరీ తీయండి అని చెప్పింది. ఆ మాటకు చంద్రబాబు తల 140 కిలో మీటర్ల వేగంతో తిరగసాగింది. తర్వాత ఆయన తేరుకుని రిజర్వేషన్ వుందని మీ పేరు మీద నాలుగు చీటీలు వ్రాస్తే, 40ఏళ్ల అనుభవం వున్న సీనియర్‌ను, నా పేరు మీద 40చీటీలు వ్రాసుకోవాలా... అని అడిగాడు. మధ్యలో పవన్ కలుగజేసుకుని... ఇంకా రిలీజ్‌కాని సినిమాకు విజయోత్సవం ఎందుకుగాని... రేపు 23వ తేదీ ఫలితాలు చూసాకా ఇవన్నీ మాట్లాడుదాంలే అని చెప్పి లేచాడు.

★★★★★

మే 18వ తేదీ... ప్రపంచంలోని పాతిక మేటి నగరాలను మిక్సీలో వేసి తిప్పి తీస్తే వచ్చినట్లుగా వుండే అమరావతి. ఉండవల్లిలోని తన కరకట్ట క్యాంపు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చంద్రబాబు తన పార్టీ అభ్యర్థులతో సమావేశమై వున్నాడు. చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపోటములపై మీరెవరూ అధైర్యపడొద్దు... నూటికి వెయ్యి శాతం మనమే గెలవబోతున్నాం అని చెప్పాడు. వెంటనే మంత్రి పి.నారాయణ లేచి... అక్కడే మాకు భయమేస్తోంది సార్... నూటికి నూరు శాతం అంటే ఏదో నమ్మబుద్ది పుట్టుద్ది... మీరు నూటికి వెయ్యి శాతం అంటుంటిరి... గణిత సూత్రాలలో అదెక్కడా లేదు. అదే మా డౌటు అని చెప్పాడు. దానికి చంద్రబాబు... మీకు ఏ డౌటులూ వద్దు... పొద్దున ఓట్లు వైసిపికి పడ్డాయి... మధ్యాహ్నంపైన ఓట్లు మనకు పడ్డాయి. మహిళలు వరద ప్రవాహంలా వచ్చి మనకే గుద్దారు అని చెప్పాడు. తర్వాత అభ్యర్థుల వారీగా ఆయన పరిస్థితి అడిగితే... 175మంది అభ్యర్థులు కూడా తాము గెలుస్తున్నట్లు చెప్పారు. అంతా విన్నాక చంద్రబాబు... చూసారా... 175సీట్లు మనం గెలవబోతున్నాం... ఇంత క్లియర్ మెజార్టీ వుంది. ఈవిఎంలు కాకుండా బ్యాలెట్ ఎన్నికలు అయితే మనకు ఇంకా ఎక్కువ సీట్లు వచ్చుండేవి అని చెప్పాడు. ఆ మాటకు అందరూ నోర్లు వెళ్లబెట్టారు.

★★★★★

మే 19వ తేదీ... రాత్రి 8గంటలు... ఉండవల్లిలోని తన ఇంట్లో కూర్చుని చంద్రబాబు టీవీలో వస్తున్న ఎగ్జిట్ పోల్స్ చూస్తున్నాడు. ఎక్కువ సంస్థలు కేంద్రంలో ఎన్డీఏ, ఏపిలో వైసిపికి అనుకూలంగా ఫలితాలనిస్తున్నాయి. వాటిని చూసి చంద్రబాబు ఏ మాత్రం టెన్షన్ పడకుండా హాయిగా నవ్వుకుంటున్నాడు. టీవీలలో ఈ ఎగ్జిట్‌పోల్స్ చూసి మంత్రులు నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, నక్కా ఆనంద్‌బాబులు చంద్రబాబు ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చారు. టెన్షన్ లేకుండా హాయిగా టీవీ చూస్తున్న చంద్రబాబును చూసి షాకై... ఏంటి సార్, ఎగ్జిట్ పోల్స్ మనకు వ్యతిరేకంగా వున్నాయి, మీరేంటి, ఎలాంటి టెన్షన్ లేకుండా అంత తాపీగా వున్నారని పత్తిపాటి పుల్లారావు అడిగాడు. దానికి చంద్రబాబు ఈ సర్వే వాళ్ళందరూ పొద్దున్నే పోలింగ్‌బూత్‌ల వద్దకు వచ్చి ఓట్లేసిన ఓ నలుగురిని అడిగి ఎండ వేడెక్కేసరికి వెళ్లిపోయుంటారు. మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండలో ఎవరూ సర్వేలు చేయలేదు. కాబట్టి మధ్యాహ్నం పైన నా పిలుపు మేరకు ఇంట్లోని టీవీలలో సీరియల్స్‌ను చూడడం ఆపేసి పోలింగ్ బూత్‌లకొచ్చి ఓట్లేసిన మహిళల ఓట్లపై వీళ్ళు సర్వే చేయలేదు. కాబట్టి అందరి సర్వేలు అలాగే ఏడ్చినట్లుంటాయని చెప్పాడు. ఆ మాటతో ఆయాసపడుతూ వచ్చిన మంత్రులకు కొండంత ధైర్యం వచ్చింది.

★★★★★

మే 23వ తేదీ ఉదయం 11గంటలు... ఉండవల్లిలోని తన ఇంట్లో కూర్చుని చంద్రబాబు, లోకేష్‌లు ఎన్నికల ఫలితాలను చూస్తున్నారు. 150 స్థానాలలో వైసిపి ఆధిక్యం... 24స్థానాలలో టీడీపీకి ఆధిక్యత... అని వస్తోంది. మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావులు ముఖాలు వేలాడేసుకుని అక్కడకు వచ్చారు. సార్, అంతా అయిపోయింది... మనం ఓడిపోతున్నాం అని అన్నారు. చంద్రబాబు అది విని మౌనంగా వున్నాడు. కాని లోకేష్ టక్కున రియాక్టయ్యాడు. ఏంది ఓడిపోయేది... నాన్నగారు ఏమి చెప్పారు. పొద్దున వేసిన ఓట్లు వైసిపికి పడ్డాయి, మధ్యాహ్నంపైన వేసిన ఓట్లు తెలుగుదేశానికి పడ్డాయని కదా... ఇప్పుడే మధ్యాహ్నం అయ్యింది... ఇక లెక్కపెట్టే ఓట్లన్నీ మనవే.. గెలుపు మనదే... కదా నాన్నారు అని చంద్రబాబు వైపు చూస్తూ అడిగాడు. లోకేష్ తెలిసి అడిగాడో, తెలియక అడిగాడో తెలియక చంద్రబాబు అంత బాధలోనూ కొడుకు వైపు జాలిగా చూశాడు.

---

శబరి శ్రీరామక్షేత్రంలో...

## హనుమజ్జయంత్యుత్సవాలు



నెల్లూరు దర్గామిట్ట రాంనగర్‌లోని శ్రీ శబరి శ్రీరామక్షేత్రం ఆవరణంలో వెలసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో ఈనెల 26 నుండి 29వ తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి వారికి విశేష అలంకారాలు, హోమాలు, అభిషేకాలు, లక్ష మల్లెల అర్చన, వడమాల, అప్పాలమాల తదితర విశేష పూజలు జరుగుతాయి. సర్పగ్రహ దోష నివారణకు స్వామివారి వెండి డాలరుతో పిల్లలకు కంకణధారణ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ కమిటీ వారు కోరుతున్నారు.

**బైరాగిమఠంలో..** నెల్లూరు టెక్కేమిట్ట బైరాగిమఠంలోని శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈనెల 23న మధ్యాహ్నం నూతన శిఖర ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. 27 నుండి 30వ తేది వరకు శ్రీ హనుమజ్జయంతి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆ తేదీలలో ప్రతిరోజు శ్రీస్వామి వారికి అభిషేకాలు, పల్లకి సేవ, అన్నదానం తదితర విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు కోరారు.

## గీతామయిలో అన్నదానం

నెల్లూరు బాలాజీనగర్ లోని గీతామయి వృద్ధాశ్రమంలో ఈనెల 20న జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా అభిమానులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ సమాజానికి పనికొచ్చే ఎన్నో సినిమాలు తీశారని, ఆయన స్ఫూర్తితోనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. సుధ, రహీం, సాయి మహేష్, సుకుమార్, వంశీ, తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

---

## జయకేతనం



నాడు పదిహేనేళ్ళ క్రితం
ముఖ్యనేతగా వైయస్సార్ పదవీ స్వీకారం
నేడు వైయస్సార్ కాంగ్రెస్ నాయకుడిగా
తనయుని పదవీ మహోత్సవం!..
తండ్రి బాటలో నడిచావు
దిశానిర్దేశకుడివై నిలిచావు
సకల జనావళికి అభిమానపాత్రుడవై
మరెందరికో ఆత్మీయబంధువువై
జగదానంద నాయకుడివై జయజయధ్వానాలతో
ప్రభంజనం సృష్టించి
జయకేతనం ఎగరేశావు
ఎన్నికలలో విజయమ్ము
సూర్యోదయమై ప్రభవించిన వేళ
అఖండ భారతికి పాలనలో
చంద్రకాంతులందించ నిలిచావు
నీ పదవీ స్వీకార పండుగను
అమరావతి స్వాగతంతో..
పలకరిస్తోంది.
వచ్చేశాయ్.. వచ్చేశాయి..
జగన్నాథ (జగనన్న) రథచక్రాల్
అంటూ ఆంధ్రావని.. పరవశిస్తోంది
ప్రజల ఆకాంక్షలు తీరిన ఆమని శుభవేళ
ఈ అక్షర మందారమాలతో
నవ్యాంధ్ర.. పులకరిస్తోంది.
జై వైయస్సార్సీ..
జైజై వైయస్సార్సీ!



రచన: ఇసనాక దయాకర్‌రెడ్డి
కోవూరు, సెల్. 9701815056

---

# ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా?

## రిజిస్ట్రార్ ఆఫీసుల్లో బాధితుల నరకయాతన

**నెల్లూరు జిల్లాలో ఆన్‌లైన్ సమస్యతో రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతుండడంతో అధికారులు, క్రయ విక్రయ దారులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు.**

ప్రస్తుతం రిజిస్ట్రేషన్ వ్యవహారం మొత్తం ఆన్‌లైన్‌తో ముడిపడి వుంది. ముఖ్యంగా ఎనీవేర్ అవకాశం రిజిస్ట్రేషన్‌లో ఉండడంతో ఆన్‌లైన్‌లోనే చేయాల్సి వుంది. దీంతో పాటు ఏదైనా రిజిస్ట్రేషన్ చేయాలంటే ముందుగా ఆ సర్వే నెంబరు నిషేధిత జాబితాలో ఉందా లేదా అనే విషయాన్ని ఆన్‌లైన్‌లో చూడాల్సివుంది. ఈ విధంగా ప్రతి విషయం ఆన్‌లైన్‌తోనే ముడిపడి వుంది.

జిల్లాలో మొత్తం 19 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వున్నాయి. వీటికి బీయస్ఎన్ఎల్ నెట్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. బీయస్ఎన్ఎల్‌కు సంబంధించి తరచూ నెట్ సమస్య ఎదురౌతున్నది. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజు మార్చి రోజు నెట్ సమస్య తలెత్తుతున్నది. ముఖ్యంగా మండల ప్రాంతాల్లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెట్ సమస్య అధికంగా ఉండడంతో అక్కడ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. బీయస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్య తలెత్తడానికి చాలా చోట్ల టెక్నికల్ సమస్యలు ఉన్నట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో మొత్తం నెట్‌తో పాటు, ఫోన్ సమస్యలు వస్తున్నాయని కొంతమంది అధికారులు చెబుతున్నారు.

తరచుగా ఆన్‌లైన్ సమస్య వస్తుండంతో సబ్‌రిజిస్ట్రార్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెట్ సమస్య వల్ల తమ టార్గెట్‌ను పూర్తి చేయలేకున్నామన్నారు. మంచి రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకుందామని వచ్చిన క్రయవిక్రయదారులకు ఆన్ లైన్ సమస్య ఉందని రిజిస్ట్రేషన్ చేయలేమని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుతిరిగి పోవాల్సిన పరిస్థితి నెలకుంది. దీంతో రిజిస్ట్రేషన్ ఆదాయం గణనీయంగా పడిపోతున్నది.

## దేశంలో..

# 'నమో'నినాదం

- నరేంద్ర మోడీకే జైకొట్టిన భారతావని
- విపక్షాల కుయుక్తులు చిత్తుచిత్తు
- దేశ వ్యాప్తంగా మట్టి కరచిన మహామహులు
- అన్ని రాష్ట్రాల్లోనూ మోడీ హవా
- అమేథీలో రాహుల్ పరాజయం



*భారత రాజకీయ చరిత్రలో కొత్త శకం మొదలైంది. ఇందిరా కుటుంబీకులు తప్పితే ఈ దేశాన్ని ఎవరూ పాలించలేరు అనే పరిస్థితి నుండి 'టీ' అమ్ముకునే సామాన్యుడు కూడా ఈ దేశ రాజకీయాలను శాసించగలడు, దేశ భవిష్యత్‌ను నిర్దేశించగలడు అనే స్థితికి దేశ రాజకీయాలు వచ్చాయి. ఒక సామాన్యుడు ఈరోజు దేశ రాజకీయ చరిత్రను తిరగరాశాడు. తనను అధికారపీఠం నుండి దించడమే లక్ష్యంగా చేసుకుని కుట్రలు, కుయుక్తులు పన్నుతున్న దాదాపు డజను పార్టీల అధినేతల ఆశలను సమాధి చేశాడు. దేశ యవనికపై కొత్త బీజాక్షరాలు లిఖించాడు. కేంద్రంలో కాషాయం జెండాను రెండోసారి రెపరెపలాడించాడు.*

నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ... 50ఏళ్ల క్రితం గుజరాత్ రైల్వేస్టేషన్‌లో టీ అమ్మి వుండొచ్చు. 40ఏళ్ల క్రితం నాగపూర్ ఆరెస్సెస్ కార్యాలయంలో గదులు చిమ్మి ఉండొచ్చు. కాని ఇప్పుడు మాత్రం దేశంలో కాంగ్రెస్ అనే పార్టీనే లేకుండా క్లీన్ చేస్తున్నాడు. 130ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీకి పునర్జన్మ లేకుండా చేస్తున్నాడు.

భారత పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ మరోసారి విజయకేతనం ఎగురవేసింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకుగాను, 542 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా దాదాపు 350 స్థానాలలో ఎన్డీఏ తిరుగులేని ఆధిక్యం సాధించి, వరుసగా రెండోసారి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టడానికి సిద్ధమైంది. ఎన్డీఏకు పూర్తి మెజార్టీ రాకుంటే అన్ని పార్టీలను కలుపుకుని బీజేపీయేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సోనియా, చంద్రబాబు, మమతా బెనర్జీ, మాయావతి, శరద్‌పవార్ వంటి నాయకులు చేసిన ప్రయత్నాలన్నీ నిర్వీర్యమైపోయాయి. దేశ వ్యాప్తంగా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలలో తప్పితే మిగిలిన అన్ని రాష్ట్రాలలోనూ బీజేపీ, దాని మిత్ర పక్షాలు ఘనమైన ఫలితాలు సాధించడం విశేషం. అన్నీ తానై, అంతా తానై బీజేపీని విజయబాటలో నడిపించిన నరేంద్ర మోడీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడానికి రంగం సిద్ధమైంది.

# నెల్లూరులో... 'ఫ్యాన్'స్వీప్

నెల్లూరు గడ్డ... వైసిపి అడ్డా... అని మరోసారి నిరూపితమైంది. కడప జిల్లా తప్పితే వైసిపికి నెల్లూరుజిల్లానే కంచుకోట అన్నది మరోసారి ఋజువైంది. నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలతో పాటు పది అసెంబ్లీ నియోజకవర్గాలను వైసిపి క్లీన్‌స్వీప్ చేసింది. నెల్లూరు లోక్‌సభ వైసిపి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన ప్రత్యర్థి టిడిపి అభ్యర్థిపై బీద మస్తాన్‌రావుపై దాదాపు 1,25,000 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. తిరుపతి లోక్‌సభ నుండి వైసిపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్ తన ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి శ్రీమతి పనబాక లక్ష్మిపై 2,26,061 ఓట్ల తేడాతో విజయం సాధించాడు.

నెల్లూరు నగరం నుండి వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్ సంచలన విజయం నమోదు చేసుకున్నాడు. ఆయన తన సమీప ప్రత్యర్థి, మంత్రి పి.నారాయణపై 1,988 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. సర్వేపల్లి నియోజకవర్గం నుండి పోటీ చేసిన మరో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా ఓటమిబాట పట్టాడు. ఆయన తన ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతిలో 13,866 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టిడిపి అభ్యర్థి అబ్దుల్ అజీజ్‌పై 20,167 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. గూడూరు నుండి వైసిపి అభ్యర్థి వి.వరప్రసాద్‌రావు టిడిపి అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌పై 43,231 ఓట్లు మెజార్టీతో విజయం సాధించాడు. సూళ్లూరుపేట నుండి వైసిపి అభ్యర్థి కిలివేటి సంజీవయ్య టిడిపి అభ్యర్థి, మాజీమంత్రి పరసా రత్నంపై 61,147 ఓట్ల తేడాతో భారీ విజయం కైవసం చేసుకున్నాడు. వెంకటగిరి నుండి వైసిపి అభ్యర్థి మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి 38,577 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. ఇక్కడ టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ హ్యాట్రిక్ విజయంలో విఫలమయ్యాడు. ఆత్మకూరు వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి టిడిపి అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్యపై 23,257 ఓట్ల తేడాతో గెలుపొందాడు. ఉదయగిరి వైసిపి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టిడిపి అభ్యర్థి బొల్లినేని రామారావుపై 36,081 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. కావలి నుండి వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి టిడిపి అభ్యర్థి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిపై 13,789 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. కోవూరు నుండి వైసిపి అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టిడిపి అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై 39,737 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. 23వ తేదీ కౌంటింగ్ మొదలైన తొలి రౌండ్ నుండే వైసిపి హవా మొదలైంది. నెల్లూరు నగరంలో మెజార్టీ వైసిపి వాళ్ళకు కొంత టెన్షన్ కలిగించినా చివరకు అది కూడా వారి ఖాతాలోనే చేరాయి. జిల్లా రాజకీయ చరిత్రలో అన్ని సీట్లను ఒకే పార్టీ గెలవడం ఇదే ప్రథమం. ఎన్టీఆర్ ప్రభంజనంలో కూడా 1983లో ఉదయగిరి సీటులో బీజేపీ, 1994లో కావలి సీటులో కాంగ్రెస్ గెలిచింది. 1989లో జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవగా, నెల్లూరు సీటు ఇండిపెండెంట్ ఖాతాలో చేరింది. ఒకే పార్టీ ఇకే గుర్తు మీద జిల్లాలో అన్ని స్థానాలు గెలవడం గత 4దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఇదే మొదటిసారి!

## నవ్యాంధ్రలో..

# నవోదయం

- చారిత్రాత్మక తీర్పునిచ్చిన తెలుగు ప్రజలు
- అవినీతి బాబుకు తిరస్కారం
- ఒక్క అవకాశం ఇచ్చి చూద్దామని జగన్‌కు మద్దతు
- జగన్ ప్రభంజనంలో కొట్టుకుపోయిన టీడీపీ అతిరథులు
- 22 ఎంపీ సీట్లతో జాతీయంగానూ ప్రాధాన్యం



*ఆయన పోరాటం వృధా కాలేదు... ఆయన సంకల్పం నీరుగారలేదు. ఆయన చిత్తశుద్ధి ముందు పరిస్థితులే తల వంచాయి. ఆయన పడ్డ కష్టానికి రాజకీయ వాతావరణమే అనుకూలించింది. ఓటమికి క్రుంగిపోలేదు. శత్రుమూకలు తనను చుట్టుముట్టినా చలించలేదు. ఒక్క క్షణం కూడా ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని వీడలేదు. మాట తప్పని మడమ తిప్పని ఆ ధైర్యానికి, ఎవరెస్ట్ శిఖరం పెరిగిన అతనిలోని ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపమే 2019 ఆంధ్రప్రదేశ్ శాసన సభ మరియు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు.*

సర్వేల అంచనాలను దాటుకుంటూ... ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించింది. 35ఏళ్ల తెలుగుదేశం పార్టీని, 40ఏళ్ల అనుభవం వున్న చంద్రబాబును మట్టి కరిపించింది. మొత్తం 175 శాసనసభ స్థానాలకుగాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 150 స్థానాలలో విజయదుందుభి మోగించి ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకుంది. అధికార తెలుగుదేశం 24 స్థానాలకు పరిమితం కాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను పోటీ చేసిన భీమవరం, గాజువాక రెండు స్థానాల్లోనూ ఘోరపరాజయం పొందాడు. ఆయన పార్టీ కేవలం ఒక్క సీటుకే పరిమితమైంది. పవన్ కళ్యాణ్ గాజువాకలో మూడో స్థానానికి పడిపోవడం ఇంకో విశేషం! ఎన్నికల్లో ఎలాగైనా గెలిచితీరాలని చెప్పి ఎన్నికలకు మూడు నెలల ముందు పసుపు-కుంకుమ, పింఛన్‌లు, అన్నదాత సుఖీభవ వంటి స్కీమ్‌లతో రాష్ట్ర ఖజానాను నాకేసి, ఫలితాలలో అద్భుతాలు సృష్టించాలని చూసిన చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినట్లు తీర్పిచ్చారు. ఐదేళ్ళ పరిపాలనను గాలికొదిలి 5 నెలల ముందు తెచ్చే స్కీమ్‌లను ప్రజలు ఆదరించరన్నది ఈ ఫలితాల ద్వారానైనా నాయకులు తెలుసుకోవాలి.

### ఓటమి బాట పట్టిన అతిరథులు...

తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం నుండి నిమ్మకాయల చినరాజప్ప తప్పితే... చంద్రబాబు క్యాబినెట్ లోని మిగతా మంత్రులందరూ కూడా దారుణ ఓటమిపాలయ్యారు. చంద్రబాబు తనయుడు లోకేష్ మంగళగిరి నుండి తాను పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే పరాజయం పొందాడు. అలాగే, మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎన్.అమరనాథ్‌రెడ్డి, దేవగుడి ఆదినారాయణరెడ్డి, నక్కా ఆనందబాబు, జవహర్, భూమా అఖిలప్రియ, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, పితాని సత్యనారాయణ, సిద్దా రాఘవరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, కిడారి శ్రావణ్‌కుమార్ తదితరు లంతా ఓటమిబాట పట్టారు.

### అన్ని జిల్లాల్లోనూ ఆధిపత్యం...

రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ వైసిపి జెండా రెపరెపలాడింది. ఏ జిల్లాలోనూ టిడిపికి మెజార్టీ స్థానాలు రాలేదు. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో 52 అసెంబ్లీ సీట్లకు గాను వైసిపి 50సీట్లలో విజయఢంకా మోగించింది. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తిరుగులేని ఆధిక్యత దిశగా దూసుకుపోయింది.

### పార్లమెంటులో రికార్డ్...

లోక్‌సభ ఫలితాలలోనూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రికార్డు విజయాలను నమోదు చేసింది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకుగాను 22 స్థానాలలో ఘనవిజయం సాధించింది. దేశ చరిత్రలో ప్రస్తుత ట్రెండ్‌లో డిఎంకె తర్వాత పెద్ద ప్రాంతీయ పార్టీగా నిలిచింది. ప్రస్తుత ఫలితాలలో దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే వైసిపి కంటే కూడా డిఎంకె ఒక్కటే ఎక్కువ ఫలితాలు సాధించడం విశేషం. 40 స్థానాలకు పోటీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ అయితే 22 సీట్ల వరకే గెలుచుకుంది. కాని, వైసిపి మాత్రం 25సీట్లకు పోటీ చేసి 22సీట్లను కైవసం చేసుకోవడం అతిపెద్ద విజయంగా చెప్పుకోవచ్చు.

ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలిస్తే తడ నుండి ఇచ్ఛాపురం దాకా రాష్ట్రంలో ఒకే తరహా ట్రెండ్ పనిచేసింది. అన్ని జిల్లాలోనూ ప్రభుత్వంపై వ్యతిరేకత, అధికార పార్టీ సిటింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత బాగా కనిపించింది. అదే సమయంలో ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ఒక్కసారి ఓటు వేసి చూద్దాం... అనే కాన్సెప్ట్ బలంగా పని చేసింది. అవినీతి, అక్రమాలకు లైసెన్స్‌లిచ్చాడా అన్నట్లుగా అధికార పార్టీ నేతల ఆగడాలు మితిమీరాయి. వీటన్నింటినీ ప్రజలు ప్రత్యక్షంగానే గమనిస్తూ వచ్చారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుకుంటూ వచ్చారు. ఈ వ్యతిరేకతను తాత్కాలిక స్కీంలు అధిగమించలేకపోయాయి.

అదే సమయంలో ప్రతిపక్ష నేతగా వై.యస్.జగన్ సమర్ధవంతంగా రాణించాడు. 2014 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు దూరం కాలేదు, సరికదా... ప్రజలకు మరింత చేరువయ్యాడు. ప్రతిపక్ష నేతగా ఈ ఐదేళ్ళు ప్రజల మధ్యే వున్నాడు. ప్రజాసంకల్ప పాదయాత్రతో ప్రజలకు మరింత చేరువయ్యాడు. ప్రత్యేకహోదా పోరాటంతో యువతకు దగ్గరయ్యాడు. మాటతప్పని, మడమతిప్పని నైజంతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నాడు. ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండంటూ జగన్ ప్రజలను కోరిన విధానం, అలాగే విజయమ్మ, షర్మిలల ప్రచారం, నవరత్నాలు... ఇంకా ఎన్నెన్నో వైసిపి విజయంలో ప్రధానంగా పాలు పంచుకున్నాయి.

# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తజనం

## - అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం.. రథోత్సవం



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో ఇటీవల పెద్దఎత్తున జరిగిన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్స వాలకు భక్తజనం పోటెత్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న జరిగిన కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. పెంచలస్వామి, చెంచులక్ష్మీ-ఆదిలక్ష్మి అమ్మవార్ల కల్యాణోత్సవానికి ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించగా, టిటిడి అధికారి లోకనాథం, అర్చకులు నారాయణదీక్షితులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మెన్ నాగేశ్వరరావు, మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీతో పాటు ఉత్సవాల ప్రత్యేకాధికారి రవీంద్ర రెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు కను విందుగా జరిగాయి. కల్యాణోత్సవం అనంతరం స్వామివారికి 18 రకాల పుష్పాలతో ఎంతో వేడుకగా పుష్పాభిషేకం నిర్వహిం చారు. రాత్రి దేవేరులతో కలిసి పెంచలస్వామి తిరుత్తేరుపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. 19వ తేది రాత్రి తెప్పోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు చక్ర స్నానం, వసంతోత్సవాలు జరిగాయి. శ్రీచక్రంతో పాటు ఉత్సవ మూర్తులకు పూజలు చేసి చక్రస్నానం నిర్వహించారు. ఈ ఉత్స వానికి భక్తజనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆరు రోజుల పాటు స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించి ఏడవ రోజున స్వామివారిని అత్తగారిల్లయిన గోనుపల్లికి పల్లకిలో తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు వేలసంఖ్యలో తరలి రావడంతో పెంచలకోనంతా భక్తజనసం ద్రంగా మారింది. ఈ సందర్భంగా స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానాల ఆగమ పండితుడు రామాంజనేయస్వామిని దేవ స్థానం ఛైర్మెన్, అధికారులు, అర్చకులు అందరూ ఘనంగా సత్కరించారు.

## బార్ అనుమతి రద్దు చేయాలి

నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని బీవీ నగర్ వద్ద ఏర్పాటు చేస్తున్న బార్ అనుమతిని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో డీసీ రాధయ్యను కలిసి 21,22,23 డివిజన్ల అభివృద్ధి కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి కమిటీ కన్వీనర్ కిన్నెర కుమార్ మాట్లాడుతూ బీవీ నగర్ ప్రాంతంలో బార్ ఏర్పాటుతో ఆ ప్రాంతంలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా మహిళలు, ఆడపిల్లలు స్వేచ్ఛగా రోడ్లపై తిరగలేని దుస్థితి దాపురిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు అధికమవుతాయని, వెంటనే బార్ ప్రారంభాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కమిటీసభ్యులు ఎస్ఎం బాషా, చేజర్ల మహేష్, కంటే సాయిబాబు, పోతురాజు, శ్రీనివాసులు, గోపి, రంగయ్య పాల్గొన్నారు.




## ఎనిమిదేళ్ళు గడుస్తున్నా...

# పూర్తికాని ఫ్లైఓవర్ బ్రిడ్జి

గూడూరు పట్టణంలోని ఒకటవ పట్టణాన్ని, రెండవ పట్టణాన్ని కలుపుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రజల చిరకాల కోరిక ఇంకా నెరవేరనే లేదు. ఏళ్ళ తరబడి ఈ పనులు జాప్యానికి గురవుతూనే ఉన్నాయి. 2011లో ఈ పనులకు శ్రీకారం చుట్టినా నేటికీ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అటు, ఇటు రాకపోకలు సాగించాలంటే ఎంతో ఇబ్బం దిగా ఉంది. కనీసం రెండు కిలోమీటర్ల దూరం చుట్టివస్తే తప్ప ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి వెళ్ళలేని పరిస్థితి ఉంది. రెండవ పట్టణంలోని మాలవ్యా నగర్, ఇందిరానగర్, జానకిరాంపేట, ఏగువ వీరారెడ్డిపల్లె, దిగువ వీరారెడ్డిపల్లెతో పాటు పట్టణం సమీపంలోని గాంధీనగర్, చవటపాళెం, అదవయ్యకాలనీ, తిలక్ నగర్ తదితర ప్రాంతాల నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం ఒకటవ పట్టణం, రెండవ పట్టణం ప్రాంతాల్లోకి వెళ్ళాలంటే ప్రజలు, వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఒకవేళ ఆటోలో వెళ్లామన్నా 50 నుంచి 100 రూపాయలు లేనిదే ఆటోలు రావడం లేదు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని 2011లో 39 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించారు. ఒకటవ పట్టణంలోని ఎస్ఎంజి పాఠశాల వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ వంతెన రెండవ పట్టణంలోని సిరామిక్ కళాశాల వద్దకు ఒకటి, అదవయ్య కాలనీ ప్రాంతం వైపు మరొకటి నిర్మించాల్సి ఉంది. అయితే, అధికారులు పాలకుల సమన్వయ లోపంతో ఆ పనులు ఎనిమిదేళ్ళు గడుస్తున్నా పూర్తి కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సామాజిక జీవన ప్రతిబింబాలు.. ఆ 'రెండు నవలికలు'

గ్రంథ సమీక్ష


తెలుగు పాఠకులకు సుపరిచితురాలైన ప్రముఖ రచయిత్రి తురగా జయశ్యామలగారు. అనేక కథలు, నవలలు రచించి ఒక తరం పాఠకుల మనసుల్లో నిలిచిపోయిన అభ్యుదయవాది. చాలా పత్రికల్లో ఆమె రచనలు ప్రచురితమయ్యాయి. ఆమె రాసిన ప్రతి రచనలోనూ సామాజిక జీవన ప్రతిబింబాలు కనిపి స్తాయి. ప్రతి కథలో ప్రగతిశీల భావాలు, మానవతా విలు వలు వెల్లివిరుస్తాయి. ఇప్పటికే ఆమె దాదాపు 350 కథలు, 3 కథా సంపుటాలు, 43 నవలలు ప్రచురించి రచనాలోకంలో ప్రఖ్యాతిగాంచారు. ఆమె సాహితీసేవ ఎంతైనా అభినందనీయం!..

గతంలో పత్రికల్లో ప్రచురితమైన రెండు నవలి కల్ని ఒక పుస్తకంగా ఇప్పుడు ముద్రించి పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒకటి 'పెళ్ళి పందిరి', రెండవది 'కాలమిచ్చిన తీర్పు'. మొదటిది 1987లో వనితాజ్యోతి మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది. రెండవది జ్యోతి మాసపత్రికలో 1977లో సీరియల్‌గా ప్రచురితమైంది.

పెళ్ళిపందిరి నవలలో తల్లిని, తండ్రిని కోల్పో యిన పూజ.. వర్ధనమ్మ ఇంట్లో రక్షణ పొందుతూ ఉంటుంది. అక్కడ ఆమె భరత్ కామాగ్నికి గురవు తుంది. తర్వాత బయట ప్రపంచంలో అనేక బాధలు పడి చివరికి వినోద్‌ను వివాహం చేసుకుంటుంది. అతడు మంచి సంస్కారి. అనుకోకుండా భరత్ ఆమె జీవితంలో తారసపడి, ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభిస్తాడు. అతడినుంచి తనను తాను రక్షించు కోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో హతమారుస్తుంది. ఆ విధంగా పూజ హంతకురాలవుతుంది. ఆ తర్వాత అన్ని పరిస్థితులు కోర్టు విచారణ చేస్తుంది. చివరికి ఆమె విడుదలవుతుంది. ఈ కథలో తాను వివాహం చేసుకున్న వినోద్ కూడా ఆమెను అర్థం చేసుకుని మునుపటిలా హృదయపూర్వకంగా ఆదరి స్తాడు. ఇదీ సంక్షిప్తంగా పెళ్ళిపందిరి నవలికలోని కథ. ఈ నవలలో పూజ అందం, అమాయకత్వాలను రచయిత్రి బాగా వర్ణించారు. భరత్‌లాంటి మేకవన్నె పులులు, వర్ధనమ్మలాంటి హైక్లాస్ స్వార్థపరులు, కస్తూరిలాంటి నయవంచకులు ఈ నవలికలో కని పిస్తారు. వీళ్ళంతా మన చుట్టూ ఉన్న సమాజంలో పాత్రలే. అలాంటి వారిని మనం అక్కడక్కడా చూస్తూనే ఉంటాం. వార్తాపత్రికల్లో ఇలాంటి ఘటన లను మనం తరచూ చదువుతూనే ఉంటాం కూడా. పూజ మనసులోని ఒంటరితనాన్ని, దుఃఖపు లోతుల్ని, అనుభూతుల్ని-అనుబంధాల్ని రచయిత్రి ఎంతో నేర్పుతో, అత్యంత సహజమైన రీతిలో పాఠకులకు అందించారు. ఈ నవలిక చదివే ప్రతి పాఠకునికీ పూజ పట్ల ఆత్మీయత కలుగుతుంది. ఒక పురుషుని వల్ల మోసపోయినా, నీతిగా నిజాయితీగా ప్రేమించిన వ్యక్తితో బతకాలనుకున్నప్పుడు..తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిని ఆత్మరక్షణ కోసం హతమార్చడం వంటి సన్నివేశాల్లో రచనా శైలి, చివరి దృశ్యంలో సంభాషణ లేకుండా వినోద్, పూజల మనసులోని భావాలను పాఠకులకు అందించిన తీరు రచయిత్రి రచనా పరిణితికి అద్దం పడుతుంది. ఈ నవలలో నిస్సహాయురాలైన 'పూజ' లాంటి అమ్మాయి జీవన పోరాటం పాఠకుల్లో పోరాటస్ఫూర్తిని నింపుతుం దనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.


రెండవ నవలిక..'కాలమిచ్చిన తీర్పు'. కుల మతాల హెచ్చుతగ్గులు, వివక్షలు ఉండకూడదన్నది సారాంశం. చిన్నతనంలో భర్తను పోగొట్టుకున్న యువతికి మళ్ళీ పెళ్ళి చెయ్యడం న్యాయమని, ప్రేమిం చిన స్త్రీ కోసం కర్పూరంలా కరిగిపోయే పురుషులు ఉంటారని ఈ నవలిక చదివితే అర్థం అవుతుంది. ఎవరో తన గుమ్మంలో వదిలివెళ్ళిన అనాథ శిశు వును పెంచి, ఆ కారణంగా ప్రేమించిన మేనకోడలికి దూరమవుతాడు విశ్వం అనే మాస్టారు. తరువాత కస్తూరిని పెళ్ళి చేసుకుంటాడు. ఆమె కొంతకాలానికి మరణిస్తుంది. కూతురు ఫల్గుణే జీవితంగా బతుకు తాడు. చివరకు ఫల్గుణి భర్త పెళ్ళయిన కొత్తల్లోనే మరణించడంతో తన ప్రియశిష్యుడు వాసు ఆమెను వివాహం చేసుకుని మాస్టారు విశ్వం దిగులు తీరు స్తాడు. ఆ విధంగా జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవానికి, అనుభవించిన ప్రతి కష్టానికి మనసు గాయపడి నిశ్చలత్వం నింపుకున్న విశ్వం జీవిత మంతా ఈ నవలలో ముళ్ళబాటగానే కనిపిస్తుంది. సమాజం మనిషిని ఎంతగా వెంటాడుతుందో!..అతడి కష్టాన్ని పట్టించుకోదు. సరికదా సుఖంగా ఉంటే ఓర్చుకోలేదు. ఈ విషయాన్ని రచయిత్రి ఎంతో రచనా చాతుర్యంతో కళ్ళకు కట్టినట్లు రచించారు.

ఈ రెండు నవలికల్లోనూ చదివించే గుణం ఉంది. సంభాషణలు హృద్యంగా ఉన్నాయి. ప్రతి పాత్రని రచయిత్రి తీర్చిదిద్దిన తీరు స్పష్టంగానూ, నిజాయితీగానూ ఉన్నాయి. కేవలం చదివించే గుణమే కాక ఆలోచనలను రేకెత్తించే ఇలాంటి రచనలు పాఠకులను బాగా ఆకట్టుకుంటాయి. మంచి నవలికలు రెండింటిని తెలుగు పాఠకులకు ఒక పుస్తకంగా అందించిన శ్రీమతి తురగా జయశ్యామల గారు ఎంతైనా అభినందనీయులు. ఆమె కలం నుంచి మరెన్నో ఇలాంటి మంచి రచనలు జాలువారాలని ఆశిద్దాం!...






రచన :
**తురగా జయశ్యామల**
వెల : రూ.150/-
ప్రతులకు:
తురగా జయశ్యామల
ప్లాట్ నం.706, ఆరాధన-బి వింగ్,
జి.డి అంబేద్కర్ రోడ్డు, దాదర్, ముంబై- 14.



సమీక్షకులు: డా. గంగిశెట్టి శివకుమార్
నెల్లూరు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com